ఉద్యోగాలపై అదుపు ఉద్యోగాలకు మదుపు!



ఐటీ, కార్పొరేట్ సంస్థలు ఉద్యోగుల ఎంపికలో ఒక లక్షణాన్ని అంతిమంగా పరిశీలిస్తాయి. కానీ దీన్ని ఎక్కడా బయటికి చెప్పవు. ఒకవేళ ఎవరైనా అడిగినా, 'ఆ ఒక్కటీ అడక్కు' అంటూ సున్నితంగా తప్పించుకుంటాయి. నిజానికి ఉద్యోగార్థి పెంపొందించుకోవాల్సిన నైపుణ్యాల జాబితాలో చేర్చాల్సిన ఆ లక్షణం ఏమిటి? అదే 'ఉద్వేగాల నియంత్రణ'.

కంపెనీల ఎంపికల్లో పరిగణనలోకి తీసుకునే నైపుణ్యాల్లో టెక్నికల్ స్కిల్స్ నేరుగా కన్పిస్తాయి. సాఫ్ట్ స్కిల్స్ మాత్రం చాలావరకు అభ్యర్థిలో అగోచరంగా ఉంటాయి. తీవ్ర పోటీ వాతావరణంలో పరుగెత్తే కంపెనీలకు కావలసింది... వేదాంతవేత్తలు, స్థితప్రజ్ఞులు కాదు కానీ మానసికంగా స్థిమితంగా ఉండేవారు అవసరం. కౌమారప్రాయ దశ దాటివచ్చిన యువత ప్రసిద్ధ కంపెనీల్లో బాధ్యతాయుత ఉద్యోగిగా చేరినప్పుడు వారి వ్యవహారశైలి సంస్థ గౌరవానికి భంగం కలిగేలా ఉండకూడదు. సాటి ఉద్యోగులకు అసౌకర్యంగానూ ఉండరాదు. ఏ ఉద్యోగీ ఏకాకిగా పనిచేయదు. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహోద్యోగులతో అనుసంధానమై ఉంటాడు. అందుకే అందరితో సయోధ్యతో పనిచేయగలగాలి. దీనికి ఆధారం- ఉద్యోగికి మానసిక ఉద్వేగాలపై ఉండే అదుపు.

స్ట్రెస్ ఇంటర్వ్యూ..

■ ఒక ప్రశ్న, సంభాషణ, సంఘటన, సన్నివేశానికి సాధారణంగా ఎక్కువ మంది సందర్భాన్ని అనుసరించి స్పందిస్తారు. కానీ కొందరు అతిగా స్పందిస్తారు. అతికొంతమందిలో అసలు స్పందనే కన్పించదు.

అతిగా స్పందించడం, అసలు స్పందనే కనబరచకపోవడం.. ఈ రెండూ అసాధారణమే. ఇటువంటి ఉద్యోగి కారణంగా సంస్థల్లో సమస్యలు తలెత్తుతాయి. అందుకే కంపెనీలు ముందుగానే ప్రాంగణ ఎంపికల్లో భాగంగా అభ్యర్థి భావోద్వేగాలను పరీక్షిస్తాయి. ఇందుకు హెచ్.ఆర్. నిపుణులు ప్రయోగించే సాధనం 'స్ట్రెస్ ఇంటర్వ్యూ'.



■ ఒక అభ్యర్థి మానసిక ఉద్వేగాలను పరిశీలించాలనుకున్నప్పుడు హెచ్.ఆర్. సిబ్బంది ఏం చేస్తారు? తమతో ఇంటర్వ్యూలో టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌ని కూడా కూర్చోబెట్టుకొని, ఆ అభ్యర్థి చదివిన సబ్జెక్టుపై తరచి తరచి ప్రశ్నిస్తారు. సబ్జెక్టు ప్రశ్నలు, ఆద్యంతాల వరకూ వెళతాయి. ఏదో ఒక పాయింట్ వద్ద అభ్యర్థి వీటిని తట్టుకోలేక అసహనాన్ని ప్రదర్శించడమో, తన ఉద్వేగాలపై నియంత్రణ కోల్పోవడమో జరుగుతుంది.

నిజానికి ఇక్కడ, ఇంటర్వ్యూలో ఆశిస్తున్నది- అభ్యర్థి సాంకేతిక పరిజ్ఞానం అద్భుతంగా ఉండాలని కాదు. అభ్యర్థి సహన శక్తినీ, ఉద్వేగాలపై అదుపునూ మాత్రమే గమనించాలనుకుంటున్నారు.

ఇలాంటి సందర్భంలో దీన్ని ఒక దశలో గుర్తించిన అభ్యర్థి కలవరపడకుండా, తనకు తెలిసినంతవరకూ జవాబులు చెప్పి, తెలియనివాటికి సంయమనంతో, ప్రశాంతవదనంతో స్పందిస్తే... తనకు తెలియని విషయాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తానని చెప్పినా కంపెనీ ప్రతినిధులు హర్షిస్తారు. ఆ అభ్యర్థికి ఉద్వేగాలపై గల పట్టుకు మంచి గ్రేడ్ ఇస్తారు.

ఐక్యూ (ఇంటలిజెన్స్ కోషెంట్) ఉన్న అభ్యర్థులు కోకొల్లలుగా మార్కెట్‌లో లభ్యమవుతున్నారు. ఈ తరుణంలో ఈక్యూ (ఇమోషనల్ కోషెంట్) మెరుగ్గా ఉన్నవారి కోసం కంపెనీలు వెదుకుతున్నాయి. స్వీయ ఉద్వేగాలను అర్థం చేసుకోవడం, తన భావోద్వేగాలను సానుకూల పంథాలో వినియోగించగల సామర్థ్యాన్ని పెంచుకోవడం, సాటివారితో స్పర్ధలు నివారించి, సవాళ్లను ఎదుర్కొనేలా స్వీయ ఉద్వేగాలను మలచుకోవడం... ఇలాంటివి పెంపొందించుకున్నవారికి సంస్థలు ఎంతో విలువ ఇస్తున్నాయి.

'మీలో అన్ని సామర్థ్యాలున్నాయా?'

ఇంటర్వ్యూల్లో మరో తరహావి ఉంటాయి. వీటిలో అభ్యర్థిలో గుర్తించిన ప్రతికూల విషయాలను అతడి ముఖంపైనే చెప్పేస్తుంటారు. ఉదాహరణకు అభ్యర్థి పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశించి పరిస్థితులు అనుకూలించక మొదటి సంవత్సరంలో ఫైదొలగాడనుకోండి... 'ఇలా మధ్యలో దేనినైనా వదిలేయడమే మీ లక్షణమా?' అనీ, ఆశిస్తున్న వేతనం కాలమ్ చూసి 'ఇంత అడుగుతున్నారు... మీలో అన్ని సామర్థ్యాలున్నాయా?' అనీ కవ్వించే ధోరణిలో ప్రశ్నలు వేస్తుంటారు. వీటికి రెచ్చిపోయే అభ్యర్థికి బయటికి దారి చూపిస్తారన్నది చెప్పనవసరం లేదు. అలాకాక, సమయస్ఫూర్తితో 'అప్పుడు ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పీజీ వదిలేశాను కానీ ఎప్పటికైనా పూర్తి చేస్తాను', 'తగినంత సామర్థ్యం ఉందనే అనుకుంటున్నాను. ఒకవేళ కంపెనీ ఎక్స్‌పెక్టేషన్స్ ఎక్కువగా ఉంటే వాటిని అందుకునేందుకు సామర్థ్యాలు మెరుగుపరచుకుంటాను'.. ఇలాంటి సమాధానాలు అభ్యర్థి ఆత్మవిశ్వాసాన్ని చూపుతాయి. ఎంపికైన వారి జాబితాలోకి తీసుకువెళతాయి.

నేర్చుకునే లక్షణం

ఉద్యోగార్థికి తెలియనిదీ- ప్రాంగణ ఎంపికలకు వచ్చే కంపెనీల ప్రతినిధులకు తెలిసినదీ అయిన విషయం ఒకటి ఉంది. తాము ఎంపిక చేసుకుంటున్న అభ్యర్థుల్లో ప్రస్తుతం ఉన్నవి పరిమిత నైపుణ్యాలే అని కంపెనీలకు తెలుసు. నిజానికి ఎంపికయిన అభ్యర్థి మాత్రం తనలో బ్రహ్మాండమైన స్కిల్స్ ఉన్నందునే ఇంతమందిలో తను ఎంపికయ్యాననుకుంటాడు. అభ్యర్థుల్లోని నైపుణ్యాలు తమకు కావలసినంత లేకపోయినా, వారిలోని ఒక లక్షణాన్ని గుర్తించి సంస్థ ఎంపిక చేసుకున్నదన్న విషయం చాలామందికి తెలియదు. ఆ లక్షణమే- నేర్చుకునే సామర్థ్యం (లెర్నింగ్ ఎబిలిటీ). కంపెనీలు తమకు కావలసిన నైపుణ్యాలన్నీ మూటగట్టి అభ్యర్థి నెత్తిన ఉండాలని కోరుకోవడం లేదు. అసలు చాలా సందర్భాలలో సంస్థలకు అవసరమైన స్కిల్స్ అప్పటికప్పుడు అభ్యర్థుల్లో లేకపోయినా కంపెనీలు వారిలో కొత్త విషయాలపై ఆసక్తి, నేర్చుకోవాలన్న జిజ్ఞాసను గుర్తించి వారిని ఎంపిక చేసుకుంటున్నాయి.

నేర్చుకునే లక్షణం కంపెనీల దృష్టిలో అభ్యర్థిని తేజోవంతంగా నిలుపుతోంది. ఎందువల్లనంటే శరవేగంగా పురోగమిస్తున్న సాంకేతిక విజ్ఞాన వికాసంలో ఈ రోజున్న టెక్నాలజీ రేపు మసకబారుతోంది. అలాంటప్పుడు ఉద్యోగార్థిలో ప్రస్తుతం ఉన్న స్కిల్స్ కొంతకాలం వరకే అక్కరకు వస్తాయి. ఆపై అప్రస్తుతమవుతాయి. అప్పుడు కంపెనీకి కావలసిన సాంకేతికతను ఉద్యోగి అందుకోగలగాలి, నేర్చుకోగలగాలి. అలాంటివారికే ప్రాంగణ ఎంపికల్లో కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

ప్రామిసింగ్‌గా ఉంటేనే ఇంప్రెషన్

కొంగొత్త ఆలోచనలతో కళకళలాడుతున్న ఉద్యోగార్థి ఈసురోమని ఉంటే కంపెనీలకు గిట్టదు. సంస్థలకు గట్టి మేలు జరగాలంటే అభ్యర్థులు అన్నివిధాలా విలువైనవారిగా (రిసోర్స్‌ఫుల్) కన్పించాలి. ఇలా ఉండాలంటే- అభ్యర్థి తన సబ్జెక్టులో తాజా విషయాలు క్షుణ్ణంగా తెలుసుకొని ఉండాలి. మార్కెట్‌లో ఏం జరుగుతుందో చెప్పగలిగి ఉండాలి. ఉదాహరణకు ఒక ఐటీ విద్యార్థికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వివిధ రంగాల్లో విస్తరిస్తున్న వైనం కొంతైనా తెలిసివుండాలి. దీనిపై కనీసం ఐదారు నిమిషాలు తడుముకోకుండా చెప్పగల సమాచారంతో ఉండాలి. అలాగే, వివిధ ప్రశ్నలకు స్పందించే సమయంలో తనలో ఉన్న నూతన ఆలోచనలను ఎదుటివారిని ఆకట్టుకునేలా చెప్పగలగాలి. అలాంటి అభ్యర్థులను కంపెనీకి పనికి వచ్చేవారిగా గుర్తిస్తారు.

మేనేజ్‌మెంట్ రివ్యూ

ఇటీవల కొన్ని ప్రసిద్ధ కంపెనీల ఎంపికల్లో 'మేనేజ్‌మెంట్ రివ్యూ' అనే రౌండ్ ఉంటోంది. ఉద్యోగం ఆశిస్తున్న వారిలో నిక్షిప్తమై ఉన్న సామర్థ్యాలు, నైపుణ్యాలు ఏమిటన్న కోణంలో దీనిలో పరిశీలిస్తున్నారు. ఎంపికయ్యే వ్యక్తి భవిష్యత్తులో కంపెనీకి భారం కాకూడదు. ఆ అభ్యర్థి తన సామర్థ్యాలతో కంపెనీకి ఆస్తి (అసెట్) కావాలన్నది ఈ రౌండ్‌లో పరిశీలించే కోణం. కంపెనీలో ఎదిగే లక్షణాలున్న అభ్యర్థులను గుర్తించడమే మేనేజ్‌మెంట్ రివ్యూ లక్ష్యం. ఈ రౌండ్‌లో ప్రామిసింగ్‌గా కన్పించిన అభ్యర్థి పట్ల కంపెనీ ప్రతినిధులు ఇంప్రెస్ అవుతారని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ప్రాంగణ నియామకాల తులా భారంలో అభ్యర్థి టెక్నికల్, సాఫ్ట్ స్కిల్స్ రెండూ ఇరువైపులా సమానంగా ఉండాలి. డొమైన్ పరిజ్ఞానంలో దడదడలాడించేస్తున్న వ్యక్తికి సాఫ్ట్ స్కిల్స్‌లో చెమట పట్టేస్తుంటే కంపెనీకి కొరగాడు. అలాగే సాఫ్ట్ స్కిల్స్‌లో యోధానుయోధుడైనా డిగ్రీ చేసిన ప్రధాన సబ్జెక్టులో నీళ్లు నములుతుంటే సంస్థలకు ఏ ఉపయోగమూ ఉండదు.

ఇప్పటివరకూ వరుస కథనాల్లో ప్రస్తావించిన 15 నైపుణ్యాలను సమానంగా మెరుగుపరుచుకుంటే అభ్యర్థి మెయిల్ బాక్స్‌లో అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేరుతుంది. ఇవేమీ సాధ్యం కానంత బ్రహ్మవిద్యలో, నేర్చుకోలేనంత నైపుణ్యాలో కావు. కావలసిందల్లా- అవగాహన చేసుకొని ఆచరణలో పెట్టటం!

– యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎస్‌బీఐలో 80 స్పెషలిస్ట్ ఆఫీసర్‌లు

రెగ్యులర్ ప్రాతిపదికన 80 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ముంబయిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.
- అసిస్టెంట్ మేనేజర్ (సెక్యూరిటీ అనలిస్ట్): 23
- డిప్యూటీ మేనేజర్ (సెక్యూరిటీ అనలిస్ట్): 51
- మేనేజర్ (సెక్యూరిటీ అనలిస్ట్): 3
- అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (అప్లికేషన్ సెక్యూరిటీ): 3

అర్హత: పోస్టును బట్టి సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్, ఎంసీఏ, ఎమ్మెస్సీతో పాటు పని అనుభవం.
విభాగాలు: కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్.
వయసు: అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 30 ఏళ్లు; డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు; మేనేజర్‌కు 38 ఏళ్లు; అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 42 ఏళ్ల మించకూడదు.
పని ప్రదేశం: ముంబయి, నవీ ముంబయి.
వేతన శ్రేణి: అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు రూ.36,000-63,840; డిప్యూటీ మేనేజర్‌కు రూ.48,170-69,810; మేనేజర్‌కు రూ.63,840-78,230; అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు రూ.89,890-1,00,350.
దరఖాస్తు ఫీజు: రూ.750. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగుల అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది.
ఎంపిక: దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 04-03-2024.
వెబ్‌సైట్: https://www.sbi.co.in/

భోపాల్ స్మారక ఆసుపత్రిలో స్పెషలిస్టులు

భోపాల్ స్మారక ఆసుపత్రి, పరిశోధన కేంద్రంలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 12 పోస్టుల భర్తీకి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ దరఖాస్తులు కోరుతోంది.
◆ స్పెషలిస్ట్ గ్రేడ్-3: 11 ◆ క్లినికల్ సైకాలజిస్ట్: 1
విభాగాలు: మెడిసిన్, ఆఫ్తల్మాలజీ, సైకియాట్రీ.
అర్హత: ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీతో పాటు పని అనుభవం.
వయసు: స్పెషలిస్ట్ పోస్టుకు 40 ఏళ్లు, క్లినికల్ పోస్టుకు 35 ఏళ్ల మించకూడదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 26-03-2024.
వెబ్‌సైట్: https://main.icmr.nic.in/career-opportunity

తిరువనంతపురంలో ప్రాజెక్టు పోస్టులు

తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ తాత్కాలిక ప్రాతిపదికన 9 ప్రాజెక్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▲ జూనియర్ ప్రాజెక్టు ఫెలో: 3 ▲ డాక్టోరల్ రిసెర్చ్ ఫెలో: 1
▲ జూనియర్ రిసెర్చ్ ఫెలో: 3 ▲ ప్రాజెక్టు అసోసియేట్-ఖ: 2
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 05-03-2024.
వెబ్‌సైట్: https://www.iist.ac.in/career/3

వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్‌లో..

దేహ్రాదూన్‌లోని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా- 7 పోస్టుల భర్తీకి ఆఫ్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.
● ల్యాబ్ అంటెండెంట్: 4 ● డ్రైవర్: 2 ● టెక్నికల్ అసిస్టెంట్: 1
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎస్ఎస్సీ, డిగ్రీ, పీజీ డిప్లొమా.
వయసు: డ్రైవర్ ఖాళీలకు 18- 27 ఏళ్లు. మిగిలిన పోస్టులకు 18- 28 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్ తదితరాల ఆధారంగా.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 14-03-2024.
వెబ్‌సైట్: https://wii.gov.in/staff_recruitment_2024

ఎంసీఏలో చేరే వీలుంటుందా?

బీఏ/బీకాం చదివి.. ఎంసీఏ చేయడానికి అవకాశం ఉంటుందా? నూతన విద్యా విధానం ప్రకారం ఇలా చేయొచ్చట కదా? – శ్రీనివాస్



■ ఏఏసీటీఈ నిబంధనల ప్రకారం ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్) ప్రోగ్రాంలో ప్రవేశం పొందాలంటే డిగ్రీ లేదా ఇంటర్మీడియట్‌లో మ్యాథ్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. కొన్ని ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో మాత్రం ఇంటర్‌లో మ్యాథ్స్ చదవకపోయినా ఎంసీఏలో చేరవచ్చు. కానీ అలాంటి విద్యార్థులు ఎంసీఏ మొదటి సంవత్సరం సబ్జెక్టులతో పాటు, మ్యాథమెటిక్స్‌ను బ్రిడ్జ్ కోర్సుగా చదివి ఉత్తీర్ణత సాధించాలి. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎంసీఏ ప్రోగ్రాం విద్యార్హతలను ఏఏసీటీఈ ఇంకా ప్రకటించలేదు. జాతీయ విద్యావిధానం- 2020 పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తే ఏ డిగ్రీ చదివినవారైనా, ఏ పీజీ ప్రోగ్రాంలో అయినా ప్రవేశం పొందే వీలుంటుంది. కానీ, అంతకంటే ముందు ఇంటర్మీడియట్, డిగ్రీ పాఠ్య ప్రణాళికల్లో విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉంది. ఇంటర్/ డిగ్రీలో మ్యాథ్స్ చదవనివారు ఎంసీఏ చదవడానికి అవకాశం ఉందో, లేదో తెలియాలంటే ఈ విద్యా సంవత్సరం ఐసెట్/ నిమ్‌సెట్ అడ్మిషన్ల నోటిఫికేషన్లు వచ్చేవరకు వేచి ఉండండి. ఇంజినీరింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్ లాంటి ప్రొఫెషనల్, టెక్నికల్ కోర్సులకు మ్యాథ్స్‌లో ప్రావీణ్యం చాలా అవసరం. కాబట్టి గణితంలో బ్రిడ్జి కోర్సు చేసి.. నైపుణ్యాలు పెంచుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

వీడియో ఎడిటింగ్/ మేకింగ్
సంస్థ: రిజల్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 26
అర్హతలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, వీడియో మేకింగ్ నైపుణ్యాలు
internshala.com/i/34761a

కొక్కు ప్రాఫిటెక్
1. కంటెంట్ రైటింగ్
స్టైపెండ్: నెలకు రూ.2,500
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 23
అర్హతలు: బ్లాగింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ రాయడంలో నైపుణ్యం
internshala.com/i/0af2cc

2. బిజినెస్ డెవలప్‌మెంట్
స్టైపెండ్: నెలకు రూ.2,500
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 23
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, మార్కెట్ అనాలిసిస్, నెగోషియేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు
internshala.com/i/e7a849

3. ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్
స్టైపెండ్: నెలకు రూ.2,500
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 23
అర్హతలు: అకౌంటింగ్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, ట్యాలీ నైపుణ్యాలు
internshala.com/i/fd4d1f

ఫ్యాషన్ డిజైన్
సంస్థ: ఇతిహాస్ ప్రొడక్షన్స్
స్టైపెండ్: నెలకు రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 26
అర్హతలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కోరల్‌డ్రా, ఫ్యాషన్ డిజైనింగ్ నైపుణ్యాలు
internshala.com/i/e85664

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: ది అఫర్డబుల్ ఆర్గానిక్ స్టోర్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 26
అర్హతలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్, గూగుల్ యాడ్‌వర్డ్స్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ నైపుణ్యాలు
internshala.com/i/184977

ఎంబెడెడ్ సొల్యూషన్స్
సంస్థ: ల్యాబ్‌వైల్డ్ సొల్యూషన్స్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 28
అర్హతలు: సీ ప్రోగ్రామింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ నైపుణ్యాలు
internshala.com/i/9f3936

టీచింగ్
సంస్థ: టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఫర్ సోషల్ ఛేంజ్
స్టైపెండ్: నెలకు రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 28
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఆఫీస్, టీచింగ్ నైపుణ్యాలు
internshala.com/i/523f6f

మార్కెటింగ్
సంస్థ: ఆగ్వా ఇండియా
స్టైపెండ్: నెలకు రూ.3,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 29
అర్హతలు: ఎంఎస్-ఎక్సెల్ నైపుణ్యం
internshala.com/i/76ed8e

ఆర్కిటెక్చర్
సంస్థ: శిల్పశాస్త్రం
స్టైపెండ్: నెలకు రూ.4,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 23
అర్హతలు: అడోబ్ ఫొటోషాప్, ఆటోక్యాడ్, ఆటోడెస్క్ రెవిట్ నైపుణ్యాలు
internshala.com/i/1207de

విజయవాడలో

రిసెర్చ్
సంస్థ: పెట్రికర్ ఇన్వెస్టిమెంట్ ప్రై. లిమిటెడ్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 25
అర్హతలు: రిసెర్చ్ అండ్ అనలిటిక్స్ నైపుణ్యాలు
internshala.com/i/c143b7

జావా ట్రెయినర్
సంస్థ: సిప్‌నటెక్
స్టైపెండ్: నెలకు రూ.6,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 26
అర్హతలు: జావా నైపుణ్యం
internshala.com/i/f9ede7

విశాఖపట్నంలో

ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్
సంస్థ: బ్రాండ్ ఎడ్యుకేషన్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 26
అర్హతలు: క్లయింట్ రిలేషన్‌షిప్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ నైపుణ్యాలు
internshala.com/i/ae7683

ఇంజినీర్లకు ఆహ్వానం

ఘజియాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) తాత్కాలిక ప్రాతిపదికన 34 ప్రాజెక్టు ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రాజెక్టు ఇంజినీర్ పోస్టులకు పోటీ పడాలంటే.. బీఈ/ బీటెక్ (కంప్యూటర్ సైన్స్) ఇంజినీరింగ్ డిగ్రీ 55 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది. సీ++, ఎస్‌డబ్ల్యూ టెస్టింగ్, ఎస్‌డబ్ల్యూ డాక్యుమెంటేషన్, పైతాన్ నైపుణ్యంతోపాటు రెండేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.

✦ కోర్సులో భాగంగా చేసిన అకాడమీ/ టీచింగ్/ రిసెర్చ్ వర్క్, ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్ వర్క్‌లను అనుభవంగా పరిగణించరు.
✦ బీఈ/బీటెక్ పూర్తిచేసిన తర్వాత పొందిన పని అనుభవాన్ని మాత్రమే లెక్కలోకి తీసుకుంటారు.

మొత్తం 34 పోస్టుల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 13, ఓబీసీలకు 12, ఈడబ్ల్యూఎస్‌లకు 02, ఎస్సీలకు 04, ఎస్టీలకు 03 కేటాయించారు.

01.01.2024 నాటికి అభ్యర్థుల వయసు 32 సంవత్సరాలు మించకూడదు. గరిష్ఠ వయసులో ఓబీసీలకు 3 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10 ఏళ్ల సడలింపు ఉంటుంది. దరఖాస్తు ఫీజు రూ.472. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు మినహాయింపు ఉంటుంది.

రాత పరీక్షకు 85, ఇంటర్వ్యూకు 15 మార్కులు కేటాయించారు. రాత పరీక్షలో సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. దీంట్లో చూపిన ప్రతిభ ఆధారంగా 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ, ఎంపికైన అభ్యర్థుల పేర్లను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. అభ్యర్థులను ప్రాథమికంగా 3 ఏళ్ల కాలానికి విధుల్లోకి తీసుకుంటారు. తర్వాత సంస్థ అవసరాలు, అభ్యర్థుల పనితీరు ఆధారంగా మరో ఏడాది పొడిగిస్తారు.

✦ మొదటి సంవత్సరం నెలకు రూ.40 వేల వేతనం, రెండో ఏడాది రూ.45 వేలు, మూడో ఏడాది రూ.50 వేలు, నాలుగో ఏడాది రూ.55 వేల వేతనం చెల్లిస్తారు.
✦ వేతనంపైన నెలకు 10 శాతం ఏరియా అలవెన్స్ ఉంటుంది. ఇన్సూరెన్స్ ప్రీమియం, స్టిచింగ్ చార్జీలు, పుట్‌వేర్ అలవెన్స్‌కు ఏడాదికి రూ.12 వేలు అందజేస్తారు.

కోర్సులో భాగంగా చేసిన అకాడమీ/ టీచింగ్/ రిసెర్చ్ వర్క్, ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్ వర్క్‌లను అనుభవంగా పరిగణించరు. బీఈ/బీటెక్ పూర్తిచేసిన తర్వాత పొందిన పని అనుభవాన్ని మాత్రమే లెక్కలోకి తీసుకుంటారు

గమనించాల్సినవి

❖ ఎంపిక చేసిన అభ్యర్థులను సంస్థకు చెందిన ఏ యూనిట్‌లోనైనా నియమించే అవకాశం ఉంటుంది.
❖ విధి నిర్వహణలో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణించాల్సి వుంటుంది.
❖ ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ/ పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక కేటాయింపులు/ సడలింపులు వర్తిస్తాయి.
❖ ప్రభుత్వ/ ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న అభ్యర్థులు దరఖాస్తుతోపాటు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'ను సమర్పించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 01.03.2024
వెబ్‌సైట్: http://www.bel-india.in/

చదువు,
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
ఈ-మెయిల్: edc@eenadu.in

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి ఉద్యోగార్థులకూ, విద్యార్థులకూ ఎన్నో సందేహాలూ, ప్రశ్నలూ సహజం. వాటిని పోస్ట్ ద్వారా కానీ ఈ-మెయిల్ ద్వారా కానీ మాకు పంపండి. నిపుణులు Q & A కాలమ్‌లో సమాధానాలు ఇస్తారు.